సాగునీటి గోస!



పోలంపల్లి శివారులో బోరుబావిలో అదనపు పైపులు దించుతున్న మెకానిక్

- పడిపోతున్న భూగర్భజలాలు
- అడుగంటుతున్న బోరుబావులు
- ఆందోళనలో రైతులు
- యాసంగి సాగుకోసం పాట్లు

భీమారం: వేసవి ప్రారంభంలో ఎండలు దంచికొడుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరగడంతో భూగర్భజలాలు పడిపోతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో బోరుబావుల్లో నీటిమట్టం గణనీయంగా పడిపోవడంతో అడుగంటిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెన్నూరు నియోజకవర్గంలోని భీమారం మండలం వ్యవసాయ ఆధారిత ప్రాంతం. మండల వ్యాప్తంగా 11 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 1720 వ్యవసాయ బోరుబావుల కింద రైతులు యాసంగి సీజన్‌లో 5500 ఎకరాలు వరి సాగు చేస్తున్నారు. బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గుతుండడంతో పంటల సాగు చేసేందుకు రైతులు అనేక పాట్లు పడుతున్నారు. కొందరు మోటార్లు ఆన్‌చేయగానే కొద్దిసేపటికి కొన్ని బోర్ల నీళ్లు పోస్తున్నాయి. మరికొన్ని బోర్ల నుంచి నీరు రాకపోవడంతో మెకానిక్‌ల వద్దకు పరుగులు తీస్తున్నారు. 20 ఫీట్ల లోతుకు నీరు పడిపోతుండడంతో బోరులో అదనపు పైపులు దించాలని సూచిస్తున్నారు. గత ప్రభుత్వం పంప్‌సెట్లకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తే ఇబ్బంది కలుగలేదు. ప్రస్తుత ప్రభుత్వం పంప్‌సెట్లకు నిర్ణీత సమయం కేటాయించి విద్యుత్ సరఫరా చేస్తున్నా బోర్లు అడుగంటుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు పైపులకు ఖర్చయింది



వ్యవసాయ బోరులో నీటిమట్టం తగ్గిపోవడంతో ఈసారి రెండు 10 ఫీట్ల పైపులు దింపాను. నీరు బయటకు తెచ్చేందుకు పైపులకు అదనపు ఖర్చు అయింది. పంట చేతికి వచ్చే సమయంలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం కావడం లేదు.

– ముదిగిరి బీరేష్, రైతు, కాజీపల్లి

బోర్లలో నీళ్లు పడలేదు



ఆర్కెపల్లి శివారులో నీళ్లు పడకపోవడంతో బోరుపై పెట్టిన ఖర్చు వృథా అయింది. తనతోపాటు మరో 15 మంది బోర్లు నీళ్లు పడకపోవడంతో నష్టపోయాం. ప్రభుత్వం స్థానిక చెరువులను అభివృద్ధి చేసి నీటిని సరఫరా చేస్తే బోరుబావులపై ఆధారపడే పరిస్థితి ఉండదు.

– నందెల తిరుపతి, రైతు, ఆర్కెపల్లి

పైపులకు అదనపు ఖర్చు

బూర్గుపల్లి, పోలంపల్లి, మద్దికల్, పోలంపల్లి, ఆర్కెపల్లి, ఎలకేశ్వరం తదితర గ్రామాల్లో 20 ఫీట్ల వరకు లోతుకు పడిపోయాయి. బోరుబావుల్లో పైపులు కొనుగోలు చేసి అందులో దింపడంతో రైతులకు అదనపు ఖర్చవుతుంది. కాగా, వర్షాకాలంలో సమృద్ధిగా వానలు పడినప్పటికి ప్రస్తుతం బోరుబావుల్లో భూగర్భజలాలు ఎందుకు పడిపోతున్నాయో అర్థం కావడం లేదని రైతులు అంటున్నారు.

నేటి నుంచి మహమ్మాయి ఉత్సవాలు

- ఇళ్లల్లో మూడు రోజులు, విశ్వకర్మ సంఘ భవనాల్లో తొమ్మిదిరోజులు
- ఏటా ఉగాది ముందే జరుపుకోవడం ఆనవాయితీ



ఆస్నాదలో తీగదారి పూలతో అలకంరించిన మంటపం, మధ్యలో అమ్మవారి (ఫైల్)

చెన్నూర్‌రూరల్: ఉగాది సందర్భంగా గ్రామీణ, పట్టణాల్లో శనివారం నుంచి మహమ్మాయి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. విశ్వబ్రాహ్మణులు, విశ్వకర్మలు ఏటా పండుగకు ముందు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అమావాస్య నుంచి ఉత్సవాలను జరుపుకుంటారు. అడవిలో లభించే తీగదారి పూలను తీసుకువచ్చి ప్రత్యేక మంటపాన్ని వాటితో అలకరించి అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. మండలంలోని నాగాపూర్, ఆస్నాద, పొక్కూరు, దుగ్నెపల్లి, ముత్తరావుపల్లి, అంగ్రాజ్‌పల్లి, సుద్దాల, కిష్టంపేట తదితర గ్రామాల్లో ఉగాది ముందు రోజు అమావాస్య నుంచి పనిముట్లను పూజిస్తారు. విశ్వకర్మ సంఘ భవనాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజులపాటు ఉత్సవాలను జరుపుకుంటారు. వడ్రంగులు, స్వర్ణకారులు, శిల్పి, కమ్మరి, కంచరి వత్తులు చేసే విశ్వబ్రాహ్మణులు ఈ పండుగను సంస్కృతిని చాటి చెప్పేలా జరుపుకుంటారు. చివరి రోజు మంగళహారతులతో ఇంటింటికి వెళ్లి అమ్మవారికి పూజలు చేస్తారు.

అమావాస్య రోజు ప్రారంభం



ఏటా ఉగాది ముందు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. విశ్వబ్రాహ్మణులకు ఇది పెద్ద పండుగ. అమావాస్య నుంచి ఉత్సవాలను జరుపుకుంటాం.

– గౌరోజు శ్రీనివాసాచారి, ఆస్నాద, పూజారి

పనిముట్లనే పూజిస్తాం



పనిముట్లను దేవతలుగా కొలుస్తాం. ఇళ్లల్లో మూడు రోజులు పూజలు నిర్వహిస్తాం. అదే సంఘంలో తొమ్మిది రోజుల పాటు పూజలు చేస్తాం.

– ఏలేశ్వరం నరసింహాచారి, ఆస్నాద

క్లుప్తంగా

పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ వర్కర్లకు వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న బ్రహ్మానందం

పాతమంచిర్యాల: జిల్లాలో దళిత అభివృద్ధిశాఖ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో పనిచేసే వాచ్‌మెన్, కుక్, స్కావెంజర్, స్వీపర్లకు ప్రభుత్వం వెంటనే వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో శుక్రవారం వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్లకు జీవో 60 ప్రకారం రూ.15,600 వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేస్తున్నారని తెలిపారు. పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో పనిచేసేవారికి ఈఎస్ఐ, పీఎఫ్‌లు లేకుండా తక్కువ వేతనం రూ.6 వేల నుంచి 10 వేలు చెల్లిస్తున్నారని అన్నారు. ఒక్కరోజు సెలవు ఇవ్వకుండా పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. వారికి కనీస వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పోస్‌మెట్రిక్ హాస్టల్ వర్కర్లు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: పట్టణానికి చెందిన పబ్బా రాకేశ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు మెరుగైన వైద్యసేవల కోసం సీఎం సహాయ నిధి నుంచి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి రూ.2.75 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాకేశ్ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకుడు సుశీల్‌కుమార్ శుక్రవారం ఎల్‌వోసీ మంజూరుపత్రాన్ని అందజేశారు. నాయకులు చింతల శ్రీనివాస్, కొంపెల్లి బానేశ్, చెన్న వెంకటేశ్ పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు బుద్ధి చెబుతాం’

మంచిర్యాలక్రైం: ట్రాన్స్‌జెండర్లను అవమానపర్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు బుద్ధి చెబుతామని మంచిర్యాల ట్రాన్స్‌జెండర్స్ అధ్యక్షురాలు సీహెచ్.అర్చన మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి అవమాన పర్చడాన్ని తీవ్రంగా ఖండించారు. శుక్రవారం స్థానిక బెల్లంపల్లి చౌరస్తాలో ఆందోళ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాతృదాయ ఫౌండేషన్ ఫౌండర్ నాంపల్లి నీతూ, మంచిర్యాల ట్రాన్స్‌జెండర్స్ పాల్గొన్నారు.

ఎడ్లబండ్ల పోటీలు



బహుమతులు అందజేస్తున్న నాయకులు

కాసిపేట: మండలంలోని పెద్దధర్మారంలో శుక్రవారం ఎడ్లబండ్ల పోటీలను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ప్రారంభించారు. రైతు పుట్ట శేఖర్ ఆధ్వర్యంలో పెద్ద ధర్మారం నుంచి గురువాపూర్ వరకు ఈ పోటీలు నిర్వహించారు. మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతి గెల్లపల్లి గణపతి(చిన్న వెంకటపూర్) రూ.10 వేలు, రెడ్డి అభయ దేవా(ఊరు మందమర్రి) రూ.8వేలు (ద్వితీయ), పుట్ట శేఖర్(ముత్యంపల్లి) రూ. 7వేలు (తృతీయ) అందజేశారు. మాజీ జెడ్పీటీసీ రౌతు సత్తయ్య, కాంగ్రెస్ నాయకులు మైదం రమేశ్, గోలేటి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఏక్‌భారత్-శ్రేష్ఠ్ భారత్



వేషధారణలతో చిన్నారులు

దండేపల్లి: మండలంలోని గూడెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏక్‌భారత్-శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు హర్యానా, తెలంగాణ ప్రజల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. అనంతరం తెలంగాణ, హర్యానా ప్రజల ఆహారపు అలవాట్ల ఫొటోలను ప్రదర్శించారు. వాటిని గురించి ఉపాధ్యాయులు వివరించారు. హెచ్‌ఎం కమలాకర్, ఉపాధ్యాయురాలు స్రవంతి, సీఆర్పీ రమేశ్ పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ హెచ్చరించారు. గుడిపేట రైతువేదికలో నకిలీ పత్తి విత్తనాలపై రైతులకు, విత్తన డీలర్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మార్కెట్‌లో నకిలీ విత్తనాలు నిల్వ చేసినట్లు దృష్టికి వస్తే పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ శాఖకు సమాచారం అందించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కల్పన మాట్లాడుతూ ప్రతీ రైతు లైసెన్స్ కలిగిన విత్తన డీలర్స్ వద్దనే బిల్‌తోపాటు విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. పంట కాలం పూర్తయ్యే వరకు ఆ బిల్ వారి వద్ద ఉంచుకోవాలని సూచించారు. అంతకుముందు నకిలీ విత్తనాలపై అవగాహన కలిపించేలా చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఏడీఏ అనిత, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఏవో కృష్ణ పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: నిషేధిత గ్లైసిల్ పత్తి విత్తనాలు సాగు చేసి రైతులు నష్టపోవద్దని బెల్లంపల్లి ఏడీఏ రాజానరేందర్, తాళ్లగురిజాల ఎస్సై రమేశ్ అన్నారు. ఆకెనపల్లిలో వ్యవసాయ ,పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిషేధిత పత్తి విత్తనాలు సాగు వలన కలిగే అనార్థాలపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఏవో ప్రేమ్‌కుమార్, ఏఎస్సై మజారుద్దీన్, ఏఈవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై గోపతి సురేశ్

కాసిపేట: కోమటిచేను, దేవాపూర్‌లో రైతులకు నకిలీ పత్తివిత్తనాలు, గ్లైసిల్ బిటి విత్తనాలు,, గ్లైఫోసెట్‌పై అవగాహన కల్పించారు. ఏవో ప్రభాకర్, ఏఎస్సై రవీందర్, ఏఈవోలు రమ్య, సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.

నెన్నెల: రైతులు నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దని ఏవో సృజన సూచించారు. మన్నెగూడంలో యాసంగి వరి పంటలను క్షేత్ర స్థాయిలో సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో రాంచందర్, రైతులు ఉన్నారు.

నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలి

జన్నారం: సాంస్కృతికశాఖలో నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ గురువారం అసెంబ్లీలో ప్రస్తావించడం హర్షణీయమని తెలంగాణ కళాకారుల యాక్షన్ రాష్ట్ర కమిటీ సభ్యులు లింగంపెల్లి రాజలింగం, కొండుకూరి రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కళాకారులకు ప్రభుత్వం ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా కళాకారులు ఆవునూరి సత్యం, గూడ రాజేందర్, కొల్లూరి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాకారులు

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

పాతమంచిర్యాల: పంజాబ్‌లో రైతుల ఆణచివేతకు నిరసనగా శుక్రవారం మంచిర్యాలలో అఖిల భారత కిసాన్ కేత్ మజ్దూర్ సంఘ నాయకులు కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. అఖిల భారత కిసాన్ కేత్ మజ్దూర్ సంఘ రాష్ట్ర సహయ కార్యదర్శి లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్, అఖిల భారత కిసాన్ కేత్ మజ్దూర్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్, కార్యదర్శి తిరుపతి, ఐఎఫ్‌టీయూ నాయకులు మల్లన్న, అరుణ, రమణ, దేవన్న, చందు, వెంకన్న, బీమేష్, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

ఒక దేశం-ఒకే ఎన్నికపై అవగాహన

రామకృష్ణాపూర్: ఒక దేశం-ఒకే ఎన్నికపై బీజేపీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ వన్ నేషన్, వన్ ఎలక్షన్ వల్ల దేశంపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. క్యాతనపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేయించడంలో గత ఎమ్మెల్యే బాల్కసుమన్, ప్రస్తుత ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఇద్దరూ విఫలమయ్యారని ఆరోపించారు. సమావేశంలో అశోక్, పోషం, తిరుపతి, ధన్‌సింగ్, అశోక్, వేణు, రాజేందర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

వరి పంటలు పరిశీలన

భీమారం: ఆర్కెపల్లి శివారులో రైతులు పండిస్తున్న వరి పంటలను శుక్రవారం ఏవో అత్తె సుధాకర్ పరిశీలించారు. పంటలకు అగ్గితెగులు సోకిందని గుర్తించారు. దీని నివారణకు ట్రైసైక్లాజోల్, మ్యాంకోజెబ్ 500 గ్రాములు ఎకరాకు పిచి కారి చేస్తే నివారించవచ్చునని రైతులకు సూచించారు.

రామాలయానికి విరాళం

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామాలయ నిర్మాణానికి మాజీ ఎంపీపీ బండారు మల్లేశ్ రూ.56,999 విరాళం ప్రకటించారు. ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం ఈ విరాళాన్ని అందజేశారు. కమిటీ సభ్యులు లచ్చగౌడ్, సత్తయ్య, మల్లేశ్, తిరుపతి, చంద్రయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కులగణన కోసం వచ్చేనెల 16న పాదయాత్ర

పాతమంచిర్యాల: కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని జాతీయ బీసీ హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పాదయాత్ర కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. ఏప్రిల్ 16న కులగణన కోసం జిల్లా కేంద్రం నుంచి హాజీపూర్ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఉచిత కంటి ఆపరేషన్లు

చెన్నూర్: పట్టణంలోని బండారి రాజేశ్వరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలానికి చెందిన 12 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేసినట్లు వైద్యుడు అభిషేక్ చిందం తెలిపారు. ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ బండారి లక్ష్మణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్క్రాప్ పట్టివేత

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా అరుణక్కనగర్‌లో ఓ స్క్రాప్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన సింగరేణికి చెందిన స్క్రాప్ వస్తువులను ఎస్అండ్‌పీసీ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. సుమారు రెండు క్వింటాళ్ల స్క్రాప్‌ను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కి తరలించినట్లు అధికారులు తెలిపారు.

స్వయం ఉపాధిపై శిక్షణ

జన్నారం: వికలాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో వికలాంగులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అనేబుల్ ఇండియా సీఏ డీఆర్‌ఈ ఎన్‌జీవో ప్రమోద్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఈడీపీ ట్రైనింగ్ ఇచ్చారు. నిర్మల్ డీఆర్‌డీవో సత్తి సాయన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కాసిపేట: అమ్మానాన్నకు అక్షరంతో గౌరవం పెంచాలని వయోజన విద్య డీఆర్పీలు బండ శాంకరీ, అశోక్‌రావు సూచించారు. వందశాతం అక్షరాస్యతలో భాగంగా మోడల్ స్కూల్, కాసిపేట, లంబాడి తండా జెడ్పీ పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన జీఎం

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ సింగరేణి గెస్ట్ హౌజ్‌కు విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి పూలమొక్క అందించారు. కమిషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబునాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, ప్రవీణ్, ఎస్ఓటూ జీఎం సత్యనారాయణ, ఏజీఎం రాజేందర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, లైజన్ అధికారి కిరణ్‌కుమార్, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, పాల్గొన్నారు.



చైర్మన్‌కు మొక్క అందిస్తున్న జీఎం శ్రీనివాస్

కొనసాగుతున్న గైర్హాజరు కార్మికుల కౌన్సెలింగ్

నస్పూర్: కార్మికులు తమ హాజరుశాతం పెంచుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో గైర్హాజరు కార్మికులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 56 మంది గైర్హాజరు కార్మికులు వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఎస్ఓటూ జీఎం ఎన్.సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీవైసీఎంఓ డాక్టర్ పి.రమేశ్‌బాబు, అధికారులు రాజేశ్వర్, రాజేష్, సంతన్, పాల్‌సృజన్, ఆకుల అఖిల పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం, అధికారులు

సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన విపత్తు సహాయక చర్యల్లో పాల్గొన్న నాన్ రెస్క్యూ మైనింగ్ సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించాలని హెచ్‌ఎంఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య, ఏరియా వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డి డిమాండ్ చేశారు. పలువురు సిబ్బంది శుక్రవారం శ్రీరాంపూర్‌లో హెచ్‌ఎంఎస్ నాయకులను కలిసి వినతిపత్రం అందజేశారు. సహాయ చర్యల్లో పాల్గొనడానికి తమను మస్టర్లను శాప్‌లో నమోదు చేయకపోవడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి అండర్‌గ్రౌండ్ మస్టర్లుగా శాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏరియా కార్యదర్శి అశోక్‌కుమార్, నాయకులు లక్ష్మణ్, బాలయ్య, అనిల్, మహేందర్ పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

మెకానికల్ చార్జ్ హ్యాండ్ ఫలితాలు వెల్లడించాలి

నస్పూర్: ఈనెల 23న నిర్వహించిన మెకానికల్ చార్జ్ హ్యాండ్ ఫలితాలు వెంటనే వెల్లడించాలని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ ఏరియా సెక్రటరీ బాజీసైదా ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫలితాల వెల్లడిలో జాప్యం కారణంగా కార్మికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. వెంటనే ఫలితాలు విడుదల చేయాలని కోరారు.

కార్మికుల సంతకాల సేకరణ

జైపూర్: ఇందారం గనిలో అధికారుల వేధింపులు నిరసిస్తూ హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికుల సంతకాల సేకరణ చేపట్టారు. హెచ్‌ఎంఎస్ యూనియన్ సెంట్రల్ కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య ఆధ్వర్యంలో కార్మికుల సంతకాల సేకరణ చేపట్టారు. గనిలో ప్రమాదానికి గురైన కార్మికుడి స్వంత ఖర్చులతో ప్రైవేట్‌లో చికిత్స పొందాలని ఆదేశిస్తున్నారని తెలిపారు. ఇందుకు నిరాకరించిన వారిపై కక్ష్య సాధింపు చర్యలు తీసుకుంటూ మానసికంగా గురిచేస్తున్నారన్నారు. అనిల్‌రెడ్డి, నర్సయ్య, కొమురయ్య, రవీందర్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

జన్నారం: మండల కేంద్రంలోని మజీద్‌లో శుక్రవారం ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ హాజరయ్యారు. సాయంత్రం ప్రార్థనలు అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. ముస్లింలకు ముందస్తుగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు రాజశేఖర్, మోహన్‌రెడ్డి, ఎస్సీరెడ్డి, శంకరయ్య, ఇసాక్, మాణిక్యం, ఇందయ్య, రమేశ్, శాబీర్, ముజ్జు పాల్గొన్నారు.

తోఫా పంపిణీ

మందమర్రిరూరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పలువురు ముస్లింలకు సీఐ శశిధర్‌రెడ్డి శుక్రవారం తోఫా పంపిణీ చేశారు. సొసైటీ వ్యవస్థాపకుడు అజీమొద్దీన్, పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్, సభ్యులు సంజీవ్, శంకర్, జావీద్‌పాషా, ఇసాక్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆర్డీవో కార్యాలయంలో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆర్డీవో శ్రీనివాస్‌రావు, ఫౌండేషన్ ప్రతినిధులు చిర్ర రాజు, పాంపాటి అనిల్‌తో కలిసి కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం ఇక్కడకు వచ్చే ప్రజల కోసం రూ.40 వేలతో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గంటకు 80 లీటర్ల నీటిని అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవుల ప్రచారం అడ్డగింత

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో శుక్రవారం క్రైస్తవులు గీతాలు ఆలపిస్తూ ప్రచారం చేస్తుండగా బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్‌గౌడ్, హనుమాన్ మాలధారులు అడ్డుకున్నారు. గ్రామంలో ఎందుకు మత ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించగా.. అనుమతి ఉందని వారు తెలిపారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు అక్కడికి వచ్చి నచ్చజెప్పడంతో వాగ్వాదం సద్దుమణిగింది.

నల్లబ్యాడ్జీలతో ముస్లింల నిరసన



తాళ్లపేటలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

దండేపల్లి/మందమర్రిరూరల్/మంచిర్యాలక్రైం: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలోని మొమ్మిన్‌పూర మజీద్ వద్ద, దండేపల్లి మండలం తాళ్లపేట, మందమర్రిలోని రెండవ జోన్‌లో గల మదీనా మజీద్‌లో ముస్లింలు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన తెలిపారు. ముఫ్తి మసూద్, ఎండీ తీజోద్దీన్, బాబా, నయిం, రహీం, శంశేర్, అఫ్జల్, దావూద్ ఖాన్, ఇమ్రాన్ ఖాన్, రాజ్ మహమ్మద్, ఎండీ షరీఫ్, యాకూబ్, బషీర్ ఇమామ్‌సాబ్ పాల్గొన్నారు.

ప్రధాన అర్చకుడిని కొనసాగించాలి

మంచిర్యాలఅర్బన్: విశ్వనాథ దేవస్థానం ఆలయంలో వేంకటేశ్వరస్వామి ప్రధాన అర్చకుడు భట్టాచార్యులు పదవీ విరమణ నేపథ్యంలో నూతన అర్చకుడు నియమించే వరకు ఆయననే కొనసాగించాలని రాష్ట్రీయ వానరసేన ఆధ్వర్యంలో ఈవో ముక్తారవికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈనెల 31న పదవీ విరమణ పొందనున్న ప్రధాన అర్చకుడు స్థానంలో మరో అర్చకుడు వచ్చే వరకు విధుల్లో కొనసాగించాలని కోరారు. మధుసూధన్ విజయ్‌కుమార్, శ్రీధర్, సంతోష్ పాల్గొన్నారు.

జాతీయ విపత్తు నిర్వహణపై అవగాహన

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ పరిషత్ ఉన్నత పాఠశాలలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ విపత్తు నిర్వహణపై అవగాహన కల్పించారు. వేసవి దృష్ట్యా జిల్లాలో అనుకోకుండా సంభవించే విపత్తుల నుంచి ఎలా బయటపడాలి, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా ఎలా అప్రమత్తం కావాలనే అంశాల గురించి ఫైర్ అధికారి డి.శ్రీనివాస్ వివరించారు. నీటిలో మునిగినప్పుడు ప్రాణప్రాయం నుంచి కాపాడే విధానం ప్రత్యక్ష పద్ధతుల ద్వారా తెలియజేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శించిన విన్యాసాలు ఆకటట్టుకున్నాయి. ఇన్‌చార్జి హెచ్‌ఎం కమలాకర్, సిబ్బంది శివకుమార్, ఉదయ్‌కిరణ్, ప్రశాంత్, శ్రీనివాస్, రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారి